క్లుప్తంగా

పెదపూడి ఎంపీడీఓగా నరేంద్రరెడ్డి


నరేంద్రరెడ్డికి శాలువ కప్పి అభినందనలు తెలియజేస్తున్న అధికారులు, సిబ్బంది

పెదపూడి: స్థానిక ఎంపీడీఓగా కె.నరేంద్రరెడ్డి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు కాకినాడ జెడ్పీ కార్యాలయంలో పని చేసి సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఈఓపీఆర్డీగా పని చేసిన ఎం.సత్యనారాయణరెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు. నరేంద్రరెడ్డికి ఈఓపీఆర్డీ, ఏఓ శ్రీనివాసారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది బొడ్డు రామకృష్ణ తదితరులు పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

492 మందికి వైద్య పరీక్షలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరాలు సోమవారం నిర్వహించారు. డాక్టర్ యన్నమని రామచంద్ర రావు (ఎన్ఆర్ఐ), డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు 246 మందికి వైద్యసేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం వారి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 182 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రక్త పరిక్షలు, నీరుడు పరీక్షలు ఉచితంగా చేసి, మందులను అందించారు. పరమహంస యోగానంద కంటి అసుపత్రి వారి ఉచిత కంటి శిబిరంలో 64 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 18 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాస రావు, సురేష్, చిన్మయ చౌదరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మధురపూడి: తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిద్దిడానికి సమష్టిగా కృషి చేయాలని కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం కోరుకొండ మండలం కాపవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లే అవుట్ అండ్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, పంచాయతీల ఆస్తులు, విద్యుత్ దీపాలు, బిల్లుల నిర్వాహణ, కోర్టు కేసుల్లో న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న సామాజిక సంక్షేమ పథకాలను వివరించారు. ఈ శిక్షణ రెండు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్ పాల్గొన్నారు.


ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ఉప సర్పంచులకు, ఇద్దరు వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వీరికి జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఈఓపీఆర్డీ శిక్షణాంశాలు వివరించారు. దానిలో భాగంగా మొదటి రోజు శిక్షణలో యోగా, పంచాయతీ పాలన, సమావేశాలు, గ్రామసభల నిర్వహణ, తనిఖీలు, పర్యవేక్షణ, పంచాయతీరాజ్ చట్టం 1994, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వాహణ, పన్నుల విధింపు, పారిశుధ్య సేవలు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ సాయిబాబు ప్రోగ్రాం డైరెక్టర్‌గా, విస్తరణాధికారి వెంకటరత్నం అసిస్టెంట్ ప్రోగ్రాం డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఆదాయం పెరిగేలా కృషి

సీతానగరం: పంచాయతీల ఆదాయం పెరిగేలా కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.భారతి అన్నారు. సోమవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతిలో ఏ సమస్య వచ్చినా ఆయా సంబంధిత అధికారుల దృష్టిలో ఉంచి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచాలన్నారు. ఈఓపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి వీరేంద్ర, స్టీఫెన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యసాయి ప్రకాష్, పంచాయతీ రాజ్ వ్యవస్థపై శిక్షణ ఇచ్చారు.

అమ్మవారికి జలాభిషేకం


కొంకుదురులో జలాభిషేకం తీసుకువెళుతున్న దంపతులు

బిక్కవోలు: కొంకుదురు గోపాల రామానాయుడు వీధిలోని దుర్గమ్మ అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సోమవారం అర్చకులు భాస్కరశర్మ, రమణ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 500 మంది దంపతులు జలాలతో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అన్నసమారధన చేశారు. ఈ కార్యక్రమంలోని చిన్నం శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, బాల భక్త సమాజం కమిటీ పాల్గొన్నారు.

సీతాఫలం.. ఎంతో ప్రయోజనం

- పోషకాల సమాహారం ఈ పండు
- సీజనల్‌గా దొరికే ఈ ఫలానికి డిమాండ్ ఎక్కువ
- ఏడీబీ రోడ్డుపై జోరుగా విక్రయాలు
- లాభాలు పొందుతున్న వ్యాపారులు


సీతాఫలాలను గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారి


ఏడీబీ రోడ్డులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన సీతాఫలాలు

రంగంపేట: పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టంగా తినే పండు సీతాఫలం. సీజనల్‌గా దొరికే ఈ పండులో ఎన్నో పోషక విలువలు, అత్యంత తియ్యగా ఉండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ముఖ్యంగా మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో దొరికే ఈ ఫలాలు రుచి ఎక్కువగా ఉండడంతో వీటికి డిమాండ్ అధికం. సీజనల్‌గా దొరికే సీతాఫలాలను వ్యాపారు ఏడీబీ రోడ్డు పక్కన పలుచోట్ల దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

ఎన్నో పోషక విలువలు

సీతాఫలాలు తినడం వల్ల ఎన్నో రకాల పోషక విలువలు శరీరానికి అందుతాయి. విటమిన్–ఎ, మెగ్నీషియం, ఫైబర్, విటమిన్ బీ6, కాల్షియం, విటమిన్ సీ, ఐరన్ వంటి పోషక విలువలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కండరాలు, నరాల బలహీనత తొలగిపోయి, శరీరానికి కావలసిన శక్తి లభించడమేకాక, కంటి రోగాలు కూడా దూరమవుతాయి. మెగ్నీషియం వల్ల గుండె జబ్బులు నయమవుతాయి. పోషకాల వల్ల శరీరంలో కొవ్వు కరిగిపోతుంది. అల్సర్లు, గ్యాస్, ఎసిడిటి, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే వీటిని పేదోడి యాపిల్ అని కూడా అంటారు.

ఎంతో మందికి జీవనోపాధి

మెట్టప్రాతమైన రంగంపేట మండలంలో కోటపాడు, రామేశంపేట, వెంకటాపురం, ముకుందవరం, జి.దొంతమూరు, ఈలకొలను, దొడ్డిగుంట, వీరంపాలెం, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల్లోని పొలాల గట్లపై, కట్టవల్లోను సీతా ఫలాల మొక్కలు పెరుగుతాయి. అదేవిధంగా కొంతమంది రైతులు తమ భూముల్లో సీతా ఫలాల సాగు చేస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబరు, నవంబర్ నెలలలో మాత్రమే ఇక్కడ సీతాఫలాలు దొరుకుతాయి. ఇక్కడ పండే సీతాఫలాలను రైతులు స్థానిక ఏడీబీరోడ్డు పక్కన పెట్టి వచ్చిపోయే వాహనచోదకులకు విక్రయిస్తుంటారు. మరి కొంత మంది రైతులు కాకినాడ, రాజమహేంద్రవరంలకు మోటారు సైకిళ్లపై తీసుకెళ్ల అక్కడ విక్రయిస్తారు. కాయల సైజును బట్టి ధర ఉంటుందని, పెద్ద సైజు ఉన్న వాటిని డజను రూ.200 నుంచి 250 వరకూ ఉంటుందని, చిన్న సైజుగా ఉన్నవి రూ.100 నుంచి 150 వరకూ ధర పలుకుతుందంటున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాలలో సీతాఫల మొక్కలు ఉన్నాయని అంచనా.

వాతావరణం అనుకూలిస్తే..



వాతావరణ పరిస్థితులు అంతా అనుకూలిస్తే అధిక దిగుబడి లభిస్తుంది. కాయలు తయారైనప్పుడు వర్షాలు కురువకుండా ఉంటే ఎక్కువ లాభం ఉంటుంది. ఈ ఏడాది వారం పది రోజులు పాటు వర్షాలు ఇబ్బంది పెట్టినా మిగతా రోజుల్లో వ్యాపారం బాగుంది.

– పి.దుర్గాప్రసాద్, వ్యాపారి, వెంకటాపురం

ధర బాగుంది



వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది సీతాఫలాలు దిగుబడి బాగుంది. దీంతో పాటు మంచి ధర పలికింది. తోటల వద్ద సీతాఫలాలు కొని ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్నాం. అనుకున్న ధర లభించడంతో ఈ ఏడాది రైతులతో పాటు వ్యాపారులకు గిట్టుబాటు దక్కింది.

– పి.సతీష్, వ్యాపారి, వెంకటాపురం

ఐకేపీ ఏపీఎం బదిలీ

రాజానగరం: మండల ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ఏపీఎం నాగహేమలక్ష్మిని రాజమహేంద్రవరం రూరల్ మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో గోకవరం మండలం నుంచి బదిలీపై వచ్చిన సునీత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

యువతి అదృశ్యం

సీతానగరం: మిర్తిపాడుకు చెందిన మార్పు నాగమ్మ మనుమరాలు తాడేపల్లి దివ్యజ్యోతి(26) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటకు చెందిన మధుకుమార్‌తో వివాహం అవ్వగా ఈనెల 6న మిర్తిపాడులోని అమ్మమ్మ ఇంటి నుంచి ఉదయం 7 గంటలకు ఆమె స్కూటీపై బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. స్కూటీ కొవ్వూరు రోడ్ కం రైల్ బ్రిడ్జీ వద్ద దొరికిందని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440904832కు తెలియజేయాలని ఎస్సై కోరారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాసిం ఫారుక్

సీతానగరం: ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని వంగలపూడి అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు షేక్ కాసిం ఫారుక్ అన్నారు. సోమవారం వంగలపూడి మసీదులో జరిగిన కార్యక్రమంలో కమ్యూనిటీ అధ్యక్షుడు కాసిం ఫారుక్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి ఏర్పాటులో విద్యావేత్తల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించాలని తెలుపుతూ అహ్మదీయ కమ్యూనిటీ జాతీయ ప్రతినిధి షీరాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా బెంగళూరులో పాల్గొని మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమలో మసీదు గురువు అక్బర్, నాగూర్, షేక్ గాలీబ్, అలి, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం: సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌కో టవర్ కండక్టర్ మార్పు చేసే పనుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ మేరకు సంపత్‌నగరం, నామవరం, కొండగుంటూరు, పుణ్య క్షేత్రం, భూపాలపట్నం, కొత్తతుంగపాడు, పాత తుంగపాడు, జి.యర్రంపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. అలాగే బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

లోకరక్షకీ పాహిమాం


చంద్రేడులో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు


వడిశలేరులో మహాచండీగా దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు


రంగంపేటలో లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- మహాచండీ, లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

రంగంపేట: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాలు ఐదో రోజు సోమవారం మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేటలో దేవీ సెంటర్, స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేకాలు అనంతరం కలశస్థాపన, సహస్ర నామ కుంకుమార్చన చేసి అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. కట్టు పొంగలి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు. మహిళలు గీతా పారాయణం చేశారు.

చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. దొంతమూరు మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విజయదుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో ముత్యాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు భారీ స్థాయిలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వడిశలేరులో ఏడీబీ రోడ్డు పక్కన వున్న విజయదుర్గా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం తదితర గ్రామాలలో ఆలయాల వద్ద విజయ దశమి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి మండపాల్లో కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీమహాలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

మధురపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో ఐదో రోజు సోమవారం శ్రీమహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ ఏర్పడింది. ఈ సందర్భంగా అమ్మవారు పూజలందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోరుకొండ మండలం గాడాల, కాపవరంల్లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గాడాల, బూరుగుపూడి, కణుపూరు. నర్సాపురం, కాపవరం, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

రేపు సామూహిక కుంకుమ పూజలు

కాపవరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త నీరు కొండ వీరన్న చౌదరి తెలిపారు. అయితే పూజ నిమిత్తం రూ.550 చెల్లించాల్సి ఉందన్నారు.


కాపవరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వీరులమ్మ త్రిశక్తి పీఠంలో మహాచండీ హోమం


అనపర్తిలో జరిగిన హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు


సంపరలో మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: అనపర్తి గ్రామంలో శరన్నవ రాత్రుల మహోత్సవం సందర్భంగా ఐదో రోజు వీరులమ్మ త్రిశక్తి పీఠంలో మహా చండీ హోమం సోమవారం నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. కొంతసేపు ప్రత్యేక పూజల్లో కూర్చొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. సంపరలోని విజయదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారు మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేక, సామూహిక కుంకుమ పూజలు చేశారు.

చండీదేవి అలంకరణలో దుర్గమ్మ


పందలపాకలో చండీదేవి అలంకరణలో సంతోషిమాత

బిక్కవోలు: దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మండలం పలు గ్రామాల్లో అమ్మవారిని చండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సోమవారం పందలపాక శ్రీదేవి అమ్మవారు, రాజరాజేశ్వరీ అమ్మవారు సంతోషిమాత ఆలయాలు ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెం, బిక్కవోలు, ఊలపల్లి, తొస్సిపూడి గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

చంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడులో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీడీఓను కలిసిన నాయకులు

రంగంపేట: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయిబాబును పలువురు బీజేపీ నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు పూల మాలలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతుల వీర సుందరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరామ్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సాయిబాబును సత్కరిస్తున్న నాయకులు →



ఏపీఎంగా ఎండీ జిలానీ బాధ్యతల స్వీకరణ

సీతానగరం: స్థానిక మండల మహిళ సమాఖ్య ఏపీఎంగా ఎండీ జిలానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనపర్తి మండల సమాఖ్యలో ఏపీఎంగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీతానగరంలో ఏపీఎం మహాలక్ష్మి నిడదవోలు మండలానికి బదిలీ అయ్యారు. క్లస్టర్ కోఆర్డినేటర్ రామచక్ర కోరుకొండ మండలానికి బదిలీపై వెళ్లారు. కొవ్వూరు, గోకవరం, రంగంపేట మండలాల్లో క్లస్టర్ కోఆర్డినేటర్లుగా పనిచేసిన హరిబాబు, వెంకటలక్ష్మి, ధారలక్ష్మి సీతానగరం బదిలీపై వచ్చారు. వారిని సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ నిర్వహించిన కార్యక్రమంలో ఇంటి పన్నులు వసూళ్ల, రోడ్లు సరిగా లేవని, వీధి లైట్లు వెలగడం లేదని, చెత్త పేరుకుపోయిందని రాపాకకు చెందిన ముత్యాల మహేష్ ఫిర్యాదు చేశారు. రఘుదేవపురం ఎస్సీపేట స్కూల్లో నాడు – నేడు పనుల్లో ప్రధానోపాధ్యాయులు అవినీతికి పాల్పడ్డాడని, తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామనికి చెందిన పసలపూడి రామారావు అధికారులకు అర్జీని అందించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు

అనుమతుల్లేకుంటే కఠిన చర్యలు


అనపర్తిలో బాణసంచా విక్రయ, తయారీదారులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీను నాయక్

పెదపూడి: ఏలాంటి అనుమతులు లేకుండా దీపావళి సామగ్రి తయారు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ హెచ్చరించారు. అనపర్తిలో ఆయన దీపావళి సాయగ్రి తయారుదారులు, విక్రయదారులతో సోమవారం మాట్లాడారు. వచ్చే దీపావళి పండగ దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఏలాంటి హానీ కలగకుండా ఉండాలన్నారు. అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచకూడదన్నారు. ఎవరైనా దీపావళి సామగ్రి నిల్వ ఉంచినా, అమ్మినా వెంటనే 112 నంబర్ గానీ, 94407 96590 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందిస్తే వెంటనే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటారని ఎస్సై తెలిపారు.

పరిపాలనా విధానంపై శిక్షణ


బిక్కవోలులో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సూరిశెట్టి సురేష్

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిపాలనా విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలంలోని 13 పంచాయతీలో ఉపసర్పంచితో పాటు ఇద్దరు వార్డు సభ్యులను ఎంపిక చేసి వారికి శిక్షణనిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో గల పారిశుధ్యం, తాగు నీరు, పంచాయతీ ఆస్తులు పరిరక్షణ, విద్యుత్ బిల్లు నిర్వహణ, లే అవుట్, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలపై వారి శిక్షణ ఇచ్చారు. వీరికి ట్రైనర్‌గా పందలపాక డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోని పలు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.